విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న కార్పొరేటర్ అమృత

ముషీరాబాద్: విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని నల్లకుంట కార్పొరేటర్ అమృత అన్నారు. ఆదివారం కరాటే, తైక్వాండో శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు పద్మకాలనీలో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. కరాటే, తైక్వాండో క్రీడలు ఆత్మరక్షణకు దోహదపడతాయన్నారు. క్రీడల్లో రాణించే వారికి కేంద్రప్రభుత్వం విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు సైతం కల్పిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి క్రీడలపై దృష్టిసారించి తమకు నచ్చిన క్రీడల్లో రాణించాలని కోరారు. పద్మ కాలనీ కార్యదర్శి రూపేందర్, ఉపాధ్యక్షులు గౌరీశంకర్, ఉమా తైక్వాండో అకాడమీ ఫౌండర్, సీనియర్ కోచ్ ప్రసన్న ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అభినందన



రాష్ట్ర ప్రభుత్వ విప్ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న న్యాయవాదులు

కాచిగూడ: మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఆదివారం మెరిట్ విద్యార్థులకు క్యాష్ అవార్డుల పంపిణీలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను పలువురు మున్నూరుకాపు న్యాయవాదులు కలిసి అభినందించారు. మున్నూరుకాపు న్యాయవాదుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కాసుల వినోద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కానుగు దేవేందర్‌లతో కూడిన ప్రతినిధుల బృందం కలిసి న్యాయవాదుల సమస్యలపై చర్చించారు. ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో మున్నూరుకాపు న్యాయవాదులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మున్నూరుకాపుల సంక్షేమం, అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ఫోన్‌కు వచ్చే లింక్‌లు నొక్కొద్దు..
డబ్బులు పోగొట్టుకోవద్దు..!

◆ మీరు కరెంటు బిల్లు చెల్లించలేదు.. మీ కరెంటు మీటర్ కట్ చేస్తున్నాం.. బిల్లు చెల్లించండి.. అంటూ ఇటీవల ప్రశాసన్‌నగర్‌లో నివసిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారికి ఫోన్ కాల్ వచ్చింది. తాను బిల్లు చెల్లించానని ఆయన చెబుతున్నా వినకుండా ఆన్‌లైన్‌లో ఈ లింక్ ఓపెన్ చేసి పే చేయండి అంటూ భయపెట్టాడు. ఆయన లింక్ ఓపెన్ చేసిన నిమిషం వ్యవధిలోనే మూడు దఫాలుగా రూ. 70 వేలు ఆయన ఖాతా నుంచి విత్ డ్రా అయ్యాయి. దీంతో లబోదిబోమంటూ ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

◆ మీకు ఫెడెక్స్ కొరియర్‌లో వచ్చిన పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయి. మిమ్మల్ని అరెస్టు చేయడానికి వస్తున్నామని బంజారాహిల్స్‌లో నివసిస్తున్న ఓ వైద్యురాలికి ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులమంటూ ఫోన్ వచ్చింది. మేము ఇచ్చిన ఖాతాలోకి డబ్బు పంపకపోతే మిమ్మల్ని వెంటనే అరెస్టు చేయాల్సి వస్తుందంటూ ఆమెను బెదిరించారు. వెంటనే ఆమె లింక్ నొక్కి రూ. లక్ష సమర్పించుకున్నారు.



సైబర్ మోసాలపై అవగాహన కోసం ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన ఫిలింనగర్ పోలీసులు

బంజారాహిల్స్: సైబర్ చీటర్స్ చేతిలో మోసపోతున్న ఇలాంటి ఘటనలు ప్రతి పోలీస్‌స్టేషన్‌లోనూ రోజుకు 5 నుంచి 10 వరకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఒక్క బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోనే ఈ ఏడాదిలో ఇప్పటివరకు సైబర్ మోసాలపై 80 వరకు ఫిర్యాదులు అందుకున్నారు. దాదాపు అన్ని పోలీస్‌స్టేషన్లలోనూ సైబర్ మోసాలపై రోజూ ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. లింక్‌లు నొక్కవద్దంటూ పోలీసులు ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కలిగిస్తున్నా బాధితుల సంఖ్య పెరగడమే కానీ, తగ్గుముఖం పట్టడం లేదు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని అవగాహన కోసం గత కొంతకాలంగా ఫిలింనగర్ పోలీసులు ఆస్పత్రులు, బ్యాంక్‌లు, హోటళ్లు, మాల్స్ ఇతర రద్దీ ప్రాంతాల్లో మోసపోవద్దు అంటూ హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు.

- వెస్ట్ జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మధురానగర్, పంజగుట్ట, బోరబండ, మాసబ్‌ట్యాంక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో సైబర్ మోసాలపై తరచూ సిబ్బందితో పాటు అధికారులు అవగాహన కలిగిస్తున్నారు. కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు.
- మోసపూరితమైన ఆన్‌లైన్ యాప్‌ల్లో పెట్టుబడులు పెట్టి నష్టపోవద్దని సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి సూచించారు.
- రోజురోజుకు పెరుగుతున్న సాంకేతికతను ఆధారంగా చేసుకుని అమాయక జనానికి అధిక వడ్డీ ఆశ చూపించి పెట్టుబడి కంటే రెట్టింపు డబ్బులు వస్తాయని చెప్పి మోసం చేస్తున్న ఘటనలు కూడా ఇటీవల పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయి.
- గుర్తుతెలియని నెంబర్ నుంచి వచ్చే లింక్స్, మెసేజ్‌లను ఓపెన్ చేయవద్దని, మన ప్రమేయం లేకుండానే మొబైల్స్‌కు వచ్చే ఓటీపీలను ఎవరికీ షేర్ చేయవద్దని పోలీసులు పేర్కొంటున్నారు.
- ఎవరైనా ఇలాంటి మోసాలకు పడితే బాధితులు వెంటనే హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు లేదా డయల్ 100కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని పోలీసులు పేర్కొంటున్నారు.
- సైబర్ నేరాలకు గురికాకుండా ఉండాలంటే లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలని కూడా పేర్కొంటున్నారు.
- కస్టమర్ కేర్ నెంబర్లను కూడా ఇటీవల ఓ విశ్రాంత అధికారి గ్యాస్ పొయ్యి రిపేర్ కోసం వెతికి భారీగా డబ్బులు పోగొట్టుకున్న విషయాన్ని కూడా పోలీసులు హెచ్చరిస్తున్నారు.
- కస్టమర్ కేర్ నెంబర్లను గూగుల్‌లో వెతకవద్దని సూచిస్తున్నారు. అపరిచితుడి నెంబర్ నుంచి ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగామ్ ద్వారా వచ్చే వీడియోకాల్స్‌కు స్పందించవద్దని కూడా హెచ్చరిస్తున్నారు.
- ప్రజలు లింక్‌ల జోలికి పోకపోతే ఖాతా నుంచి పైసా కూడా బయటకు పోదని, ఈ ఒక్క విషయాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా గుర్తించుకుని తమ బంధుమిత్రులు, చుట్టుపక్కల వారికి కూడా ఫంక్షన్లు, శుభకార్యాల్లో చర్చించుకుంటే ఎంతోమందిని కాపాడినవారమవుతామని పోలీసులు అంటున్నారు.

సైబర్ మోసాలపై పోలీసుల అవగాహన

మోసపోతే వెంటనే 1930కు ఫోన్ చేయండి

రద్దీ ప్రాంతాల్లో ఫ్లెక్సీల ద్వారా చైతన్యం

సైబర్ మోసం..? డయల్ 1930:



ఎవరైనా సైబర్ మోసానికి గురైతే క్షణాల్లోనే 1930కు ఫోన్ చేయాలి. మీరు ఎలా మోసపోయారో వివరిస్తున్న సమయంలోనే అక్కడి సిబ్బంది వెంటవెంటనే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆ మరుక్షణంలోనే డబ్బులు పోగొట్టుకున్న బాధితుల బ్యాంక్ అకౌంట్లు, చీటింగ్ చేసిన సైబర్ మోసగాడి బ్యాంక్ అకౌంట్‌ను, సైబర్ మోసగాడి బ్యాంక్ అకౌంట్ నుంచి ఇతరులకు డబ్బులు మళ్లించిన వారి ఖాతాలను కూడా స్తంభింపజేశారు. సైబర్ మోసం జరిగిన మరుక్షణంలోనే ఇలా 1930కు ఫోన్ చేయడం వల్ల బాధితుడి నుంచి మిగతా డబ్బు విత్‌డ్రా కాకుండా సైబర్ మోసగాడి ఖాతా నుంచి డబ్బు ఇతర ఖాతాల్లోకి మళ్లకుండా చేయవచ్చు. ఈ ఒక్క విషయంలో ప్రజలు బాగా అవగాహన పెంచుకోవాలి. సైబర్ మోసాల పట్ల పలు కార్యక్రమాల ద్వారా మేము అవగాహన కల్పిస్తున్నాం. లింక్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దు. అపరిచితుల కాల్స్‌కు స్పందించవద్దు. ఫెడెక్స్ పార్సిల్, కొరియర్ అంటూ ఇటీవల డ్రగ్స్ పేరిట ముంబాయి క్రైమ్ బ్రాంచ్ పోలీసులమంటూ చాలామందికి ఫోన్లు వస్తున్నాయి. ఏ ఒక్కరూ భయపడవద్దు. అలా ఫోన్ వచ్చిన మరుక్షణమే డయల్ 100కు సమాచారం ఇవ్వండి. అలాగే లింక్స్ ఓపెన్ చేయమని చెబుతారు. స్పందించవద్దు. బ్యాంక్ ఖాతాలు ఇస్తారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు బదిలీ చేయవద్దు. ఇలాంటి చిన్న చిన్న విషయాల్లో జాగ్రత్తగా ఉండి పోలీసుల రక్షణ కోరాలి.

– రాఘవేంద్ర, ఇన్‌స్పెక్టర్, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్

'కేంద్రమంత్రులకు ఘన స్వాగతం పలకాలి'

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రానికి రెండు మంత్రి పదవులు రావడం చాలా సంతోషంగా ఉందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. ఆదివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన కిషన్‌రెడ్డి, బండిసంజయ్‌లు ఈనెల 19న నగరానికి రానున్నారని, మంత్రుల రాక సందర్భంగా బేగంపేట్ ఎయిర్‌పోర్టు నుంచి బీజేపీ రాష్ట్ర కార్యాలయం వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ నేతలు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, చింతల రాంచంద్రారెడ్డి, ఆనంద్‌గౌడ్, కృష్ణయాదవ్, రాజశేఖర్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌గౌడ్, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలోని అన్ని శాఖల్లో ప్రమోషన్ ప్రక్రియను త్వరితగతిన చేపట్టాలని తెలంగాణ వ్యవసాయశాఖ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో తెలంగాణ గేజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ వైద్యనాథ్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ముఖ్యంగా జీవో నెంబర్ 317 సమస్యలను పరిష్కరించాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులకు వాహన సదుపాయాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గేజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర నాయకులు ఏలూరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఏవీజీకే ప్రసాద్, కోశాధికారి డాక్టర్ సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇంటింటికి ప్లాస్టిక్ బ్యాగుల పంపిణీ

వ్యర్థాలను రోడ్లపై వేయొద్దని సూచన

ముషీరాబాద్: బక్రీద్ పండుగ సందర్భంగా జంతువులను వధించడం వల్ల ఏర్పడే వ్యర్థాలను రోడ్లపై వేయొద్దని భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు అన్నారు. బక్రీద్ సందర్భంగా భోలక్‌పూర్‌లో ఇంటింటికి వెళ్లి ప్లాస్టిక్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ ప్రతి వీధిలో ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రజలు అధికారులకు సహకరించి రోడ్లపై వ్యర్థాలు వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్ మైనార్టీ కమిటీ సీనియర్ నాయకులు అక్లక్ హుస్సేన్, డివిజన్ మాజీ అధ్యక్షులు మహ్మద్ అలీ, మైనార్టీ కమిటీ ప్రధాన కార్యదర్శి జబ్బార్, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ద్వానా'శాస్త్రికి ఘన నివాళి

చిక్కడపల్లి: ద్వానాశాస్త్రి అని పిలవబడే ద్వాదశి నాగేశ్వర శాస్త్రి వివిధ పత్రికలకు పలు సాహితీ ప్రక్రియల్లో రచనలు అందించి సాహితీ ఖజానాగా గుర్తింపు పొందారని ప్రముఖ సాహితీవేత్త రమణ వెలమకన్ని కొనియాడారు. ఆదివారం సాయంత్రం చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని కళాదీక్షితులు కళావేదికపై 'ఎందరో మహానుభావులు' కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ద్వానా శాస్త్రి జయంతిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎందరో గ్రంథాలకు సమీక్షలు నిర్మోహమాటంగా రాసిన శాస్త్రి 80కి పైగా వివిధ ప్రక్రియల్లో రచనలు చేశారని వివరించారు. తెలంగాణ సాహిత్య వీణ పేరిట రాష్ట్రంలో లబ్ద ప్రతిష్ట పొందిన గత కాలపు సాహితీవేత్తలను నేటి వారికి పరిచయం చేశారన్నారు. ఇది పరిశోధక విద్యార్థులకు దోహదపడుతుందని పేర్కొన్నారు. కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ.. స్నేహశీలి ఉత్తమ వ్యక్తిత్వం కలశాస్త్రికి గానసభతో తన అన్నదీక్షితులుతో ఆత్మీయ అనుబంధం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆయన 12గంటల సాహితీ ప్రసంగం గానసభలో చేసినప్పుడు అశేష ప్రేక్షకులు ప్రత్యేకించి సివిల్ సర్వీస్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు హాజరు కావటం విశేషమన్నారు. ప్రముఖ గాయని ఆమని, సమాజ సేవకురాలు వెంకటరావు, యామిని పాల్గొన్నారు.

నాన్ టీచింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

ముషీరాబాద్: ఐఎఫ్‌టీయూ అనుబంధ ప్రగతిశీల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల నాన్ టీచింగ్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బట్టు మలయ్యను ఆదివారం కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఎల్.పద్మ, అరుణకుమార్‌ల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కేజీబీవీలో చేస్తున్న రెసిడెన్షియల్ సిబ్బంది, వివిధ గురుకులాల్లో పని చేస్తున్న సిబ్బంది వేతనాలలో వ్యత్యాసం తీవ్రంగా ఉందన్నారు. కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ వేతనాలు ఒక బేసిక్‌ను నిర్ణయించి జీతాలు పెంచాలన్నారు. ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలన్నారు. రిటైర్డ్ అయిన ఉద్యోగికి రూ.5-10 లక్షలు హానరోరియం ఇవ్వాలని, వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. కేజీబీవీలో టీచింగ్ ఉద్యోగాలకు అర్హులైన నాన్ టీచింగ్ సిబ్బందికి 20 మార్కులు వెయిటేజి ఇవ్వాలన్నారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ, అశోక్, సహాయ కార్యదర్శులు సాహిదా, సైదయ్య, లక్ష్మి, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాధా, నాగమ్మ, కోశాధికారి లక్ష్మీనరసయ్య, వివిధ జిల్లా, రాష్ట్ర కమిటి సభ్యులు నాగమణి, నరసమ్మ, హసీనా, వీరమణి, మౌనిక, బాలమణి, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

యానాదులను ప్రభుత్వం ఆదుకోవాలి

చిక్కడపల్లి: రాష్ట్రంలో యానాదులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర యానాది వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఆంజనేయులు అన్నారు. ఆదివారం చిక్కడపల్లిలోని ఓ హోటల్లో అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మీటింగ్‌తో పాటు యానాదాల జాతి ఆణిముత్యాలు రిటైర్డ్ డీఐజీ సీ.హెచ్ వెంకటేశ్వర్లు , ఎకనామిక్స్‌లో పీజీ పూర్తి చేసిన శివమ్మను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆంజనేయులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో యానాదులు ఎప్పటినుంచో ఇక్కడ నివసిస్తున్న సంక్షేమ పథకాలు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందడం లేదన్నారు. యానాదులను అన్ని విధాలుగా ప్రభుత్వం అభివృద్ధి చేయాలని కోరారు. రిటైర్డ్ డీఐజీ సీహెచ్ వేంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మనతో పాటు జాతిని వెనుకబడిన వారిని ప్రోత్సహించి ముందుకు నడిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు సీ.హెచ్ రామచంద్రరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న యానాదులు ఐక్యంగా ముందుకెళ్లి అభివృద్ధి చెందాలన్నారు. ఆల్ ఇండియా ఎస్సీ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు పీవీ.రమణ మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ద్వారానే చదువు ఉద్యోగాలు పదవులు రాజకీయం బిజినెస్‌లో రాణించామన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి హరిరామ్, కోశాధికారి శేషాద్రి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు భూ పంపిణీ చేపట్టాలి



మాట్లాడుతున్న డాక్టర్ జిలకర శ్రీనివాస్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భూమి లేని పేదలకు రాష్ట్ర ప్రభుత్వం భూ పంపిణీ చేయాలని వీసీకే తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలకర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ (బొజ్జ తారకం) ఆధ్వర్యంలో 'భూమిని పంచు బడ్జెట్‌ను పెంచే' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనేక దశాబ్దాలుగా భూమికోసం పోరాటాలు జరిగాయన్నారు. భూసంస్కరణలు రావడంతో మిగులు భూమి ఏర్పడిందని ఆ మిగులు భూమిని పేదప్రజలకు పంచాలన్నారు. రాష్ట్రంలో 4 లక్షల ఎకరాల మిగులు భూమి ఉందని, వాటిని గత ప్రభుత్వం వేలం వేసి అమ్ముకుందని విమర్శించారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను ఓడించి రేవంత్‌రెడ్డికి అధికారాన్ని అప్పగించారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా భూమిని వేలం వేయకుండా పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. పట్టణ, గ్రామీణ గరిష్ట భూపరిమితి చట్టాలను ఖచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌పీఐ కో-ఆర్డినేటర్ జన్ను సాంబయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, అంకేశ్వరపు రమేష్, తెలంగాణ శ్యామ్, కుమార్ గార్గె, దాసరి రాజు, శ్రీరాముల శారద, సాంబలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్‌పీఐ నూతన కమిటీ..

◆ రాష్ట్ర అధ్యక్షుడిగా జన్ను సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా అంకేశ్వరపు రమేష్, ఉపాధ్యక్షురాలిగా పీసరి రజిత, కార్యదర్శిగా రమేష్‌చంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

యువత ఉపాధి వైపు పయనించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: యువత ఉపాధి వైపు పయనించి జీవనోపాధిని పొందాలని కేశవ స్మృతి సంవర్ధన సమితి అధ్యక్షులు కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో కేశవ స్మృతి సంవర్ధన సమితి సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత డ్రైవింగ్ స్కూల్ శిక్షణ శిబిరం ఐదో జట్టు 25 మందితో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి యువతలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ యజమాని కె.ఉపేందర్, కేశవ స్మృతి సంవర్ధన సమితి కోశాధికారి రామచందర్, భరత్‌భూషన్, యశ్వంత్, మహంకాళి శ్రీకాంత్, కొప్పారపు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కులగణనతోనే బీసీల సామాజిక అభివృద్ధి

కాచిగూడ: కులగణనతోనే బీసీల సామాజిక, రాజకీయ, ఆర్థిక అభివృద్ధి జరుగుతుందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, నీలం వెంకటేష్, రాజేందర్, వేముల రామకృష్ణలతో కలిసి ప్రతినిధుల బృందం ఆదివారం పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావును కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వేముల రామకృష్ణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కులగణన పూర్తి చేసి పంచాయతీ రిజర్వేషన్లను 42 శాతం పెంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వీహెచ్‌ను వారు కోరారు. రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే విధంగా చూడాలన్నారు.

'నేషనల్ టెస్టింగ్ ఎజెన్సీ'పై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ

కాచిగూడ: నేషనల్ టెస్టింగ్ ఎజెన్సీపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే బిహార్‌కు చెందిన గ్యాంగ్ నీట్ పేపర్ లీకేజ్ చేశాయన్న విషయం బయటకు రావడంతో ఈ విషయంలో ప్రధాని నరేంద్రమోదీ వెంటనే స్పందించాలన్నారు. మెడికల్ కౌన్సెలింగ్‌ను వెంటనే నిలిపివేయాలని, అర్హులైన విద్యార్థులందరికీ న్యాయం జరిగేలా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలోనే నీట్ పరీక్ష పెద్ద స్కామ్‌గా మారిందని, నీట్ పరీక్ష నిర్వహణలో విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఎజెన్సీపై సీబీఐ దర్యాప్తు సంస్థచే విచారణ జరిపించాలన్నారు. ఈ స్కామ్ వెనుక ఉన్న ఎంతటివారినైనా వదిలిపెట్టకుండా దేశద్రోహం కింద శిక్షించాలన్నారు. లేని పక్షంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ నేతృత్వంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. రాజేష్, వినోద్, ప్రవీణ్, ఉదయ్, అభిలాష్, గిరీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు ఆత్మీయ పురస్కారం



కళాకారుడిని సన్మానిస్తున్న కృష్ణమోహన్‌రావు తదితరులు

చిక్కడపల్లి: కళలు, సాహిత్యం సమాజాన్ని ప్రభావితం చేస్తాయని వక్తలు అన్నారు. సాంస్కృతిక సేవా సంస్థ సత్య సంగీత ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి త్యాగరాయగానసభలో సామాజిక చైతన్యమూర్తుల పేరిట సినీనటులు, కళాకారులకు ఆత్మీయ పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌లు పలువురు ప్రముఖులకు ఆత్మీయ పురస్కారాలు ప్రదానం చేసి సన్మానించి మాట్లాడారు. మన సంస్కృతిని ప్రతిబింబించే కళాకారులు సాహితీవేత్తలను సత్కరించడం హర్షనీయమన్నారు. నిర్వహణ సంస్థ కళాకారులు, నటులకు పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించడం అభినందనీయమన్నారు. ప్రముఖులు శ్రీమణి, కె.కృష్ణ, హనుమంతరాయశర్మ, క్రాంతికృష్ణ, పూజిత, శైలజ, లక్ష్మీవర్మ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

నల్లకుంట: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోందని అంబర్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హనుమంతరావు 76వ జన్మదినం సందర్భంగా అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా టీపీసీసీ ఓబీసీ విభాగం వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, ఉమ్మడి ఏపీ పీసీసీ ఎస్సీ విభాగం మాజీ అధ్యక్షుడు జేబీ.శ్యామ్‌రావు, టీపీసీసీ కార్యదర్శి అజయ్‌కుమార్, సీనియర్ నాయకులు ఎస్. హరినాథ్‌రెడ్డి, దేవిరెడ్డి విజితారెడ్డి తదితరులు నల్లకుంట డివిజన్ పరిధిలోని నర్సింహ బస్తీ కమ్యూనిటీహాల్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం నల్లకుంట మార్కెట్ రోడ్డులో ఫుట్‌పాత్ వ్యాపారులు, బాటసారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్. హరినాథ్‌రెడ్డి, శరత్, కాంతారావు, ఎడ్ల నరేందర్‌రెడ్డి, దేవిరెడ్డి విజితారెడ్డి, సీహెచ్. మురళి, సాగర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మణ్, విశ్వం, మధుసూదన్, ప్రభుదాస్, కుకీస్ తదితరులు పాల్గొన్నారు.


ఇళ్లను కూల్చకుండా నాలా ప్రహరీ నిర్మించాలి



మాట్లాడుతున్న ఎస్‌బీఐ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి రాధాకృష్ణన్

ముషీరాబాద్ : ఇళ్లను కూల్చకుండా హుస్సేన్‌సాగర్ నాలాను నిర్మించాలని ఎస్‌బీఐ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి రాధాకృష్ణణ్ జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని దామోదర సంజీవయ్య నగర్‌లో ఎస్‌బీఐ కాలనీ వాసులు అత్యవసర సమావేశాన్ని భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఉన్న మాదిరిగానే హుస్సేన్‌సాగర్ నాలా ప్రహరీని నిర్మించాలని డిమాండ్ చేశారు. అధికారులు అనాలోచిన నిర్ణయాలతో నాలా ప్రహరీ నిర్మాణం పేరిట తమ ఇళ్లను కూల్చే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న మాదిరిగా ప్రహరీ నిర్మిస్తే తమ ఇళ్లకు నష్టం వాటిల్లదని వివరించారు. అధికారులు తీసుకున్న నిర్ణయం వల్ల సుమారు 30 ఇళ్లకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. గతంలో మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే ముఠాగోపాల్ తమ ప్రాంతంలో పర్యటించి ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రహరీ నిరిక్మస్తామని హామీ ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుతం దీనికి భిన్నంగా అధికారులు తమను ఇళ్లు ఖాళీ చేయాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారని పేర్కొన్నారు. స్థానికంగా పేద, మధ్యతరగతి ప్రజలు నివసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాలా ప్రహరీ ఉన్న విధంగానే నిర్మించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎస్‌బీఐ కాలనీ నాయకులు శంకర్‌గౌడ్, లక్ష్మణ్, వెంకట్ ప్రసాద్, అచంత, శ్రీనివాస్, రంగనాథ్, శివ, చైతన్య పాల్గొన్నారు.

ఘనంగా ఫాదర్స్‌డే



వివేక్‌నగర్ పీపుల్స్‌పార్క్‌లో ఫాదర్స్‌డే వేడుకల్లో చిన్నారులు

కాచిగూడ: అఖిల భారత ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఫాదర్స్ డే వేడుకలను కాచిగూడలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు తమ తల్లిదండ్రులకు కేక్‌కట్ చేసి, స్వీట్లు తినిపించి సన్మానించారు. ఈ సందర్భంగా అఖిల భారత ముదిరాజ్ సంఘం జాతీయ అధ్యక్షుడు పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే పిల్లలకు తల్లిదండ్రులు పెద్దలను గౌరవించడం నేర్పించాలని సూచించారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించినప్పుడే వారు భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరుకుంటారని తెలిపారు. ఆ దిశగా ప్రతీ తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

పీపుల్స్ పార్క్‌లో..

చిక్కడపల్లి: వివేక్‌నగర్ పీపుల్స్ పార్క్‌లో బ్రెయినోబ్రెయిన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫాదర్స్‌డే వేడుకల్లో స్కిల్‌డెవలప్‌మెంట్, అబాకస్, నృత్యాలు, ఆటలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని ఘనంగా ఫాదర్స్‌డే వేడుకలను చేసుకున్నారు. సంస్థ ప్రతినిధులు శ్రీధర్, అనిత, కాలనీవాసులు శివకుమార్, ప్రవీణ్, సుబ్బారావు పాల్గొన్నారు.

వీహెచ్‌కు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ



మాజీ ఎంపీ వీహెచ్‌తో టీపీసీసీ ఓబీసీ విభాగం వైస్ చైర్మన్ సుభాష్

నల్లకుంట: రాజ్యసభ మాజీ ఎంపీ వి. హనుమంతరావు జన్మదిన వేడుకలకు ఆదివారం నల్లకుంటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఓబీసీ విభాగం వైస్ చైర్మన్ కట్టెల సుభాష్ వీ.హెచ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ధనార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

సేవాభావాన్ని అలవర్చుకోవాలి..

కాచిగూడ: జన్మదినోత్సవానికి సేవాభావంతో ఆ డబ్బును పదిమందికి ఉపయోగపడేలా చూడాలని టీపీసీసీ ప్రధానకార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్ అన్నారు. ఆదివారం కాచిగూడ, నెహ్రూనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

- అంబర్‌పేట్/ముషీరాబాద్ జోన్ పరిధిలో పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు వీ.హెచ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.